# మధుగీత

బోయి భీమన్న

# అంకితం

శ్రీయుతులు, సాహితీపరుల్, చిత్రకారు,
లనుప మోదార హృదయులు నైన శేషు
బాలకృష్ణు, లాదర్శ దంపతులు, నాకు
పరమ మిత్రులు, వారి కీ పద్యకృతిని
కృతి యొసంగుదు సౌభాగ్య వితతిగోరి
నతులొనర్తు జయాయు రున్నతుల కొరకు
సప్త పద సప్త సంతాన సౌఖ్యదాయి.

భీమన్న

## పూజ

ఒక్క కొమ్మను మించి మరొక్క కొమ్మ
రాగ మధురము, పుష్ప భారాలసమ్ము,
ఒక్క పువ్వును మించి మరొక్క పువ్వు
మోహనము, మధుపూర మా మోదకరము

ఏ నవోదయ సుంద రోద్యాన మంది
రాంగణము నేనియును హృదయంగమముగ
రంభ నొకదాని మించి యూర్వశి యొకర్తు
పరవశము జేసి భువికి దివ్యత ఘటించు.

తద్విమోహన మోహనతా సుధాబ్ధి
మగ్నమైనది పోయి నా మానసమ్ము,
సానుభూతికి, రాగ రసానుభూతి
కెదురుతెన్నులు చూడసాగినది తనవు !

ఈ తరుణ మందు ప్రతివస్తు రీతి లోన
విశ్వరూపము గైకొని వెడలి వచ్చి
చెరగు తెరగట్టి నను గట్టు చేర్చినట్టి
సఖి ! ఇదే నీకుకావ్య పుష్పముల పూజ !

భావమందు, వాక్కునను, రూపమ్ములోన
దేవి ! లలిత కళా వాణి నీవె నాకు;
రాగమ్మై, భోగమ్మై నీవ రాక యున్న
విరిసి యుండదు తోటలో విరి యొకండు.

## మధుగీత

మేలు కొమ్మిక, ప్రియ సఖి ! మేలు కొమ్ము !
తన ప్రియాళిని బంపె నుద్యాన లక్ష్మి ;
పల్లవమ్ముల కోయిల పాడ సగె,
అలరు దీవల పవమాను డాడ సాగె.

చాలు నిక సుఖస్వప్న బాష్పములు, బాష్ప
మంజరులలోన ప్రతిబింబ మై వసించు
వర వసంతము నేడిట వచ్చె ; నింక
కొమ్మ ! కలనుండి కలకు మేల్కొమ్ము, లెమ్ము !

అభ్యుదయ మాయె రజనీ జటాంతరమున
మల్లియలు వాడె, రసదాళి మంచె మీద
కార్మికాంగన తీయు రాగమున గలిసి
సస్య దేవత లాస్యమ్ము సలపసాగె!

ఆమెతో మన యారామ రామ కేమొ
కలిగె పోటీలు, పేచీలు కలిగె నదిగొ !
పుడమి గల సౌఖ్య మెల్ల నుమ్మడి ధనమ్ము,
పంచు కొన లేని వారికి ప్రాపు వగుము.

పారిజాతమునకు, గడ్డిపరక, కెల్ల
ప్రకృతి సౌభాగ్యములు నీవు పంచి యిమ్ము !
తుమ్మెదల జూచి భీతిల్లుదువొ, లతాంగి !
గొబ్బికంపల కేమి జంకుదువొ, వలదు.

రమ్య కాశ్మీర కుంకు మారామ సీమ
వికసి తాధ్వము, తారాతి విస్తృత మసృణ
మారగమొ, జీవయాత్రకు మలప వలయు,
ప్రసవములు పూచు నపుడు నీ పద పదాన.

దారి నలిగిన దారి నిస్సార మందు
తృణము కూడ జనింపదు ; మును పెవండు
పోని నవమార్గముం బడి పోవ వలయు
సాదు జీవన మధు రసాస్వాద రతులు

ప్రాత రాత్రి గతించె, ప్రభాత మాయె,
కన్ను విప్పుము సౌగంధిక ప్రశోభ,
పూర్ణ పూరుషు నంశమ్ము పుక్కిలించి,
ముద్దియా ! నన్ను నీలోన దిద్దుకొందు.

అలిరిగుత్తుల లోన, మధ్యక్షరముల,
అమృత హస్తము ప్రేమగేయములు వ్రాసె ;
పాడ వలయును వనమెల్ల పరవశిల్ల,
చెల్వ ! కోకిలతో చెల్మి చేసికొమ్ము !

ఒక్క గుత్తియ కొక్క రాగోదయమ్ము,
అన్నిగుత్తుల దీ మధూద్యాన మెల్ల ;
ఈ ప్రకృతి నిగూఢాంతఃపుర ప్రవర్త
నమున తేనెలు తీసి యిత్తము జగాన.

తామరాకుల మీది ముత్యాల సరుల
నీ యుషస్సరస్వతి మెడ నింపుకొనెను ;
పద్మ మధు బిందువులు రాలిపడినవియును
అబ్జ దళ నేత్ర ! మధుప యోగ్యమ్ము లయ్యె.

ఈ కళా కౌశలము లభియించు దాక,
ఈ మనోజ్ఞత బ్రతుకు లయించు దాక,
ఈ విమోహన విశ్వ సరోవరాన
మగువ ! నిర్మించుకొందము మంటపమ్ము.

అతుల విశ్వము విశ్వ కళాభిశాల,
ప్రకృతి దేవి అధ్యాపకురాలు, వికచ
గౌతమీ తీర దేశాలె గ్రంథచయము
పాఠములు నేర్చు కొందము పడతి లెమ్ము

దేని ప్రేమింతువో నీవు దాని కన్న
సుందర మ్మగునది విశ్వ మందు లేదు ;
కనుక ప్రేమింపు మెల్ల సృష్టిని, వరాంగి !
క్షితి తనూవల్లినపుడు దివ్యత సుమంచు.

పుష్ప శతముల జూచి, పుష్పాడుల గోరి,
వ్రాలి వ్రాలక చను మధుపమ్ము గనుము !
మధు రస ప్రాప్తి మాట యేమైనగాని,
ప్రాణి సౌందర్యమున కంత భ్రమసిపోవు.

పూచి లోకమ్ము జూచిన పుష్పమెల్ల
కొదమ తుమ్మెద నొకదాని గోరి పిల్చు ;
ఎగురనేర్చిన షట్పద మెట్టి దేని
తేనె గల పూవునే కోరి తిరుగు, నువిద !

ఎంద రే మెంతచెప్పిన కుందరదన !
బ్రతుకు కానంద మొకటె కామితము సుమ్ము ;
పైరుపెట్టెడి రైతు దంపతుల కైక
తలలు కొట్టెడి యుద్ధ వీరులకునైన.

అంకుర మ్మాదిగా బ్రతుకంత విరిసి
అంకుర మ్మగు దాక, ననంత యాత్ర
ప్రతి పదమ్మున జీవనార్థముల నెన్నో
త్రవ్వి తల కెత్తుకొని జీవి తరలి పోవు

అచ్చెరువు గొల్పు నీదారు లందు మరచి
వ్యర్థ మొనరుప బోకుము యౌవనమ్ము,
చేతి కందిన, ఊహకు జిక్కుకొన్న
భాగయముల నెల్ల నింపుము బ్రతుకు నిండ !

తేనె తీయని సుఖముల దేలి యాడ
విరుల కాలము కోసము వేచి యుండి,
అదను గల్గిన వాంత హాస వేళ
ఉబుసు పోకల గడిపివేయుట నయమ్మె ?

మేటి యనుభూతులకు గుండె మేళవించి
ప్రేమ పరితోష పరిమళోర్మికల మీద
తేలి యాయెడి బ్రతు కొక్క త్రుటియె యైన
విశ్వగానములో నది వీణకాదె ?

ధ్రువ సముద్రము గడ్డవారెడును ఉష్ణ
జలధి కలోల్లితమ్మగు, సరసి కులము
శాంతమై యుండు ; ఇట్లె విశ్వమ్ము లోన
జీవనపు గతు లవి పరిస్థితుల కొలది.

ఆకటిని బట్టి, వేయు దాహమును బట్టి,
వాంఛనుం బట్టి, దాని తీవ్రతను బట్టి,
చిత్తగతి బట్టి, అభిరుచి స్థితిని బట్టి,
ప్రకృతి నిన్ బట్టి అనుభవింపంగవలయు.

ప్రియ ! ప్రకృతి జీవ సూత్రధారిత్వ మెందు
గలదొ రహస్య శోధనోత్కంఠ వగుము ;
ద్రాక్ష గుత్తుల నుండి సారాను దింపు
అమృత హస్తాన నాహస్త మందుకొమ్ము.

ప్రాత బాటలు ముగిసిన పట్టు నుండి
పయన మగుము నవోన్మేష పథము లందు !
ఆ రహోంతఃపురాల చోద్యాల నుండి
జగతి కణు వైన దెచ్చిన చాలు మనము.

అనుభవమ్మును మించి సత్యమ్ము లేదు,
సత్యమును మించి లేదు విజ్ఞాన మెందు,
అనుభవము లేదు ప్రేమ కంటెను, లతాంగి !
ప్రేమ హృదయమె విశ్వ జీవామృతమ్ము.

తరుణ కాలము వచ్చిన తరిసె జీవి
చీకు చింతలు రాల్చి వాసించవలయు,
తడవు చేసిన – రేపె నిదాఘు వచ్చు
తెరవ ! ఏనాటి కానాటిదే సుఖమ్ము.

పల్లవములు, పర్ణములు, పుష్పములు, సౌర
భములు, మధువులు, బహుముఖ భాసురములు
ఉద్భవించిన వొకతీవ నుండి కాదె ?
సకియ ! వికసించు నీ మోవి సకల రుచులు.

రమ్యవర్ణ స్వరాధిక రాగ మధుర
మోహన మ్మైన నీశయ్య మూర్ఛనమున
కరిగి ప్రవహించు చెలియలికట్ట ముంచి
విపుల విపుల రసానంద విలసి తముగ.

అంగనా ! కాల మొక ప్రవాహమ్ము, నిమిష
మొక్క పోకడగా నిది పోవుచుండు ;
ఊరు కోనేరు - కోనేరు ఊరు గాగ
ఉరక లిడుకొంచు పోద మభ్యుదయ వీధి.

కాల గతి మన మొక యడుగైన ముందు
బడినచో చిట్లిపోదుము బుడగ లట్లు ;
కదలకే నిల్చిపోయిన, కమల నయన !
జీర్ణమై నాచుగట్టి నశించిపోయె ?

ముందు పర్విడలే, రాగి పోవలేరు,
శాంత జీవనముం గోరు జనము లెందు ;
త్యాగ మది ముందు బడకున్న దారి లేదు,
వెనుక సరసులు లేకున్న విలువ లేదు.

చెలువ ! నీ వేగు దారిలో చలువనీడ,
లాకు మడులు, వెన్నెలవాగు, లళుల పాట
లెన్నొ కల్గును ; లాలించు నిన్ను ప్రకృతి
ఈశ్వరిని బోలు నిర్మల హృదయ వగుట

కాని, నెరవాగు కిరుకేల గల్గు పర్వ
తాగ్రములు, చల్వనీడల దరినె మండు
టెండలుం దాగు, పూవుల నిచ్చుతీవ
కంటకమ్ములు గ్రుచ్చును, కలగవలదు.

191

పరువు పరువున బోవునీ బ్రతుకులోన
గుండె కలగునో పదములు కుంటుపడునో,
శ్రమము వాపగ శీతల చ్ఛాయ లున్న
రోయబోకుము మార్గావరోధములుగ

కాంత ! రేవడి నేల నె కాదు, సుమణి
కుట్టిమ స్నిగ్ధ వాటిని గూడ కాలు
జార వచ్చును, ఏలను సంభ్రమమ్ము ?
అలపు నాపుకొని ప్రయాణ మగుము తిరిగి

ఈ నిరంతర యాత్రలో, నిందువదన !
కలిమి కలుముల, లేమి లేములనె వలచు ;
మంద మారుతములు మధు మాసమందె,
మండు వడగాడ్పులు నిదాఘు మందె వీచు

అలసత, నమాయకతను, మౌఢ్యము, నుపేక్ష,
నజ్ఞతను, బద్ధకమ్మును నవని నెపుడు
సఖి ! సహింపదు సుమి కాలచక్ర ; మెదడు
వెనుకబడు, వాని ద్రొక్కి పర్విడుచు బోవు.

ప్రొద్దుతిరుగుడు పువ్వును బోలి జీవి
ఆశయ ఫలాభి ముఖముగ నరుగు చుండు
కాంత ! లోకాని కది వర్షకాల మైన
మధు సముచ్చ యాస క్తమే మధుప కులము

శక్తిగల జీవనము సముద్రిక్త మగుచు
వివిధ రీతుల నుప్పొంగి వెల్లివిరియు,
బ్రతుకు నిండ ప్రచండ వైభవము లపుడె
పద్మ సౌరభ మధురాను భవము లపుడె.

ప్రభుతనుం గోరుకొని స్థిత ప్రజ్ఞు డొకడు
సేవకత్వములో ప్రవేశించ వచ్చు ;
కడుపులో తేనె తొన లెన్నొ కల్గు పనస
పండు తనువున ముండ్లుండవచ్చు, దేవి !

రాజకీయము కాదెల్ల బ్రతుకు మనకు,
ఎట్ల జీవించుటకె కాదు ఇంత శ్రమము ;
మకుటములు రాలె, రాజ్యాలు మంట గలిసె,
ప్రేమ కన్నెర్ర జేసిన హోమ మందు.

ప్రేమ మనునది లేనిచో, పృథ్విలోన
బిరుదు లుద్యోగములును నిల్పెదునె బ్రతుకు ?
అలపు వాపుట కొక కొమ్మ గలుగు నపుడె
అల నభో రేఖ పక్షి కాహ్వాన లేఖ.

హృదయములు రెండు, మనసులు రెండు, రెండు
కాయములు కూడ అద్దాల కరణి నొకట
నొకటి స్వచ్ఛమై ప్రతిఫలించు కొనవలయు
ఒకటి నొకటి విభిన్నత నొందరాదు.

రోసములు, అవిశ్వాసము, లీసడింపు
అంధ కోపము, లపనింద లాది కంట
కావృతమ్మైన లక మార్గమ్మునందు
చెలువ ! కడదాక నడచిపోవలయు మనము.

మలిన పథములు గడచి, నిర్మల పదాబ్జ
ములతో ఆకడ జేరుకోగలమె యేని
అమృత జీవులమే ; కాన ఆలసింప
వలదు, లెమ్మింక జీవితాధ్వములు విరియ.

ప్రకృతి గర్భమునన్ గల్గి, ప్రకృతి యొడిని
లాలనలు పొంది, ప్రకృతి పూజాలయమున
హృదయ మర్పించి, తనివొంది యున్నమీద
చెలువ ! లోకమ్మునకు లెక్క చేయనేల ?

పారములులేని ఘోర సంసార యాత్ర
నెట్లు సాగింతు నందు దుఃఖించవలదు,
అది స్వభావసిద్ధము, దాని కదియె సాగు ;
కదలబోకుము నీవు చుక్కాని వదలి.

ఎంద రెందరో నీవలె ముందు వెనుక
ఏటి కెదురీతగా లంగ రెత్తినారు ;
పవనగతి చూచి, వీచికా ప్రతతిచూచి
ఏల సందేహపడెడు ? పోనిమ్ము నౌక.

శక్తులన్నియు కూడిన శక్తి వీవు,
తీసి పార్వేయుమా పరిస్థితుల బలము ;
ఆగుటకు, సాగుటకు సాధ్యమైన రీతి
ప్రకృతిమాతను స్వాధీనపరచుకొనుము.

మొన్నటి తుఫాను దెబ్బకు మోటుకొమ్మ
లన్నియును కూలిపోయి మ్రోడైన మావి
క్రింది రెమ్మలు పూచి పరిమళించె !
ఏల నింతి ! పురాణ సంస్కృతులు మనకు ?

విరిగిపోయిన కొమ్మల మరచిపోయి,
చిన్ని రివటలకే మధుశ్రీల గూర్చు
వృక్షమాతకు వే నమస్కృతుల్లొసంగి
పట్టు పుప్పొడి తిలకమ్ము పెట్టుకొమ్ము !

చెలిమిచేయుము ప్రకృతితో, చెలిమిలోన
లేదు శీతువు, తీతువులేదు, లేమ !
శ్రావణోల్లోల శరధి గర్భముననైన
స్వాగత మ్మిచ్చు మైత్రి వసంత మట్లు.

ఏ తెరువుబట్టి పోదుమో ఆ తెరువున
వెనుదిరిగి ఒక్క అడుగేని వేయలేము ;
జరిగినది యెల్ల ముందజీకు బరువె కాన,
ప్రతి నిమేషము క్రొత్తగా పైన మగును.

బ్రతుకు స్వల్పము, కాలమా వ్యవధి నీదు,
మార్గమా క్లిష్ట, మాదర్శమా సుదూర,
మతి జవమ్మున జనకున్న, నతివమిన్న !
పల్లె చేరము చీకటి పడక ముందె.

అంధకార బంధుర మీ వనాంతరమ్ము,
కంటకావృత మైనదీ కాలిబాట,
నా యడుగులోన నడుగుంచి నడిచిరమ్ము,
మిణుగురుల నమ్మికొని స్వేచ్ఛ మెలగరాదు.

హృదయ మిదమిద్ధమని లేని వృక్ష తతులె
పూల, పండ్లో యొసంగు నీ పూజలోన ;
ఏ మొసంగుదు నేను ? నీ ప్రేమ బెరిగి
హృదయ మున్నది, సేవ చేయించుకొమ్మ.

కొందరికి గుండె చిన్నది, కొందరికి మ
నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న,
దంత మాత్రాన నిల చిన్నదనము లేదు
పెత్తనము చేయు నీ కన్ను పెద్దదైన.

పంచరంగుల పరదాల పరకృషీ ప
రార్థ పరభృతమ్ముగ నున్న దవని నేడు,
తెరలు తొలగించి, గొలుసుల త్రెంచె దేని
పంచకల్యాణిపై నది పందెమిడదె ?

నిన్న మరచి, రేపు మరచి, నేడు నీకు
ఏది సుఖదాయకము దానినే యొనర్పు ;
నిన్న సాయంతనము కన్న నేటి యుదయ
మతి మనోజ్ఞ మౌనట్టు లమర్చు కొమ్ము !

నిన్నటి పునాది మీదనె, నెలత ! నేడు
రేపటికి దిద్దుకొనుచుండు రూపురేఖ ;
రూపు రేఖల మీదనె చూపునిల్పి
ఉద్గమింపుము నిత్య నవోఢ వగుచు.

చీకటో, వెలుగో తెలిసెడిది కాదు
మనుగడలు చిన్గి తెరదీసికొనిన మీద,
చేత నవకాశ మున్నంతసేపు మనము
చీకటి వెలుంగు లనుభవించెదము, రమ్ము.

వెలుగు నెదిరించి నిల్చెదవేని, తన్వి !
కాంచవలసిన దేదియు కాంచలేవు ;
అంధకారములో దాగు నణువుకూడ
తొంగలించును దీపము తోడు నిలువ !

కమల కల్హార మధు సమీకరణ వేళ
తేనె దొంగల దలపదు తేనెటీగ ;
అభిమతానంద పారవశ్యము లభింప
సుందరీ ! నిల్చి దిక్కులు చూడనేల ?

సృష్టి యొక నారికేళము చెట్టు, దాని
కాయలను దింపువాడెపో కావ్యకర్త ;
ఎవడు నాణ్యమ్ము చేయుచు నెంచు వాని
మంచి చెడ్డలు, వాడె విమర్శకుండు.

మానవ సమాజ మను వన్యమార్గమందు
సుదతి ! సంచారమును జేయుచున్న మనకు
ముల్లు విరుగునొ, చిలుక లుమ్మునొ, విచార
మేల ? అవమానముం జెందనేల, తెలిసి ?

పార్వత క్షేత్రముల కృషీవలుడు వోలె,
గ్రీష్మ కాలాటవీ భ్రమరిక విధాన,
లభ్య మొనగూర్చుకొన్నది లవమె యైన
అది అనంత భాగ్యమ్ము, దివ్యామృతమ్ము.

వచ్చు నిమిషమ్ము తెచ్చుడి ఫలము గొనుచు,
పోవు నిమిసమ్ము దొంగిలి పోవకుండ
ముద్ర లుంచుచు, సాగి పోవుదమయేని
తరుగ దీ లేతప్రాయంపు ధాన్యరాశి.

స్వేచ్ఛ జీవస్వభావము, స్వేచ్ఛ కొరకు
పెనగు లాడును జీవి దా నణచబడిన ;
ఉర్వి నిండుగ అవకాశ ముండికూడ
ఒకని స్వేచ్ఛకు కంచెయై యొకడు నిల్చు !

అది స్వభావము పోరాట మాదినుండి ;
ప్రాణి జీవింపలేదు పోరాడకుండ,
స్వేచ్ఛ, సంపత్తులను గోరు జీవులెల్ల
సాహసే లక్ష్మి రూపాన సాగవలయు.

మనిషి పోరాడవలయును, మన దలుచు
ప్రతి తృణమ్మును పోరాడు ప్రత్యహమ్ము ;
స్వార్థమునకో, మరే పరమార్థమునకొ,
పోరు సల్పుచు ముందుకు పోవు జీవి.

స్వార్థము నశింప, మరు నిముషమ్ములోన
జీవి నశియించు, సృష్టి నశించిపోవు ;
కొమ్ము ! నీకొర, కాత్మ దేశమ్ము కొరకు
అఖిల విశ్వమ్ము కొరకు పోరాడ లెమ్ము !

తరుముకొని వచ్చు క్రూర సత్వముల దారి
తలగి నిల్చుట యది పందతనము కాదు ;
వ్యూహములు పన్ని రణము సల్పుదురు యోధు
లతివ ! మూర్ఖులు వట్టిరె అంతరింత్రు.

లోకములు బాగుపడుట కేకైక మార్గ
మేను వాకొందు, కృత్రిమమైన ధనము
పూర్తిగా నిల్వ లేకుండ బోవవలయు,
మానవుని కోర్కె లెల్లెడ మారవలయు.

గ్రుడ్డిదై లోక మీ డబ్బుకొలత మీద
పనికిమాలిన సరుకెంతొ పదిలపరచు,
ప్రకృతిమాతకు తెలియును ప్రాణి విలువ,
కాలచక్ర మెరుంగు లోకముల గతులు.

ప్రభువు దగ్గరనుండి సేవకుని వరకు
భూమి నందరు డబ్బు గులాము లతివ !
డబ్బు లేకున్న చో వట్టి మబ్బు బ్రతుకు,
బ్రతుకు వద్దన్న చో కాటి చితుకు డబ్బు.

కలువ పేదతనమ్మును గాంచి యేల
వదన పద్మముపంచి బాష్పములు నింతు ?
తిరుగబడి దొర్లివచ్చు నదృష్ట చక్ర,
మేది భాగ్యము ? దారిద్ర్య మేది జగతి ?

కలువ వికసించి పద్మనుగాంచి నవ్వు,
పద్మ మది త్రిప్పికొట్టు విభాత వేళ ;
మంచుదిబ్బ లెడారులు మనుజు లందు
శ్రీలు గలచోటనే రాజ్య మేలు గాదె ?

దుఃఖమును, దూషణమ్మును, ద్రోహచింత,
దుర్బలగుణమ్ము ; లూయెల తొట్టినుండి
లోకమును మేలుకొల్పి, మేల్కనుము నీవు.
రమ్యగుణ రత్న భూషానురణన వృత్తి.

కల నిజము కాదు, నిజము కావలతుమేని
కాటుకగ దాని దిద్దుకో గలుగ వలయు ;
మనకు నిజమే మహాస్వప్న మందిరమ్ము,
గడప దాటిన మీదట గదియె లేదు !

తోటమాలి కుటీరముతోడ నెపుడు
రాజ భవనము పోల్చి నిరాశ పడకు,
వకుళమాలకు కోట గోడకును మధ్య
హృదయ మున్నది తీసి ధరించుకొమ్ము.

ప్రకృతిపై మానవుడుచేయు ప్రవిమ లాభి
వృద్ధియే కళ, అదియే జగద్ధితమ్ము ;
సృష్టినే యది కూడతీసికొని పోవు,
నవ్య కళ కాగడా పరిణామవీథి.

తనను కన్నందు కవనీమతల్లి కతి కృ
తజ్ఞుడై నరుడిచ్చు సుందర విభూష
ణమ్ము కళ, దానిమించిన సొమ్ము లేదు ;
కావ్యము కిరీట మీ యలంకారములకు.

గాయకుడు గానమున, కవి కావ్యమందు,
శిల్పి శిల్పాన పర్యవసించి పోవు,
కార్యమున కారణ మ్మిట్లు కరిగిపోవ
పొంగి ప్రవహించు నానంద పూర్ణగంగ !

సరస వాసంత సుందరోష స్సుమమ్ము
ఏగతి వహించు బాధ్యత నే క్షణాన
శిశువు చించునో, పూజారి చిదుము కొనునో,
కాంత జటదాల్చుకొనునో, ఏ కాన్కయౌనో!

ప్రేయసీ, నిండు పున్నమరేలె యేల ?
అంధకారపు రాత్రు లానంద మిడవె ?
కాయములు మాయమ్మై పోయి కనుల ముందె
ఆత్మ జీవించు టెంత నూత్నానుభూతి !

చేయుచుంటిమి యాత్ర నిశీథమందు
గత పదము వేయు పదమును గానరావు ;
పూలు జోలలు పాడు నీ పొదల లోన
మౌనసుఖ మొంద కెందుకీ మాయసొదలు ?

గ్రామ సీమలలో, కుటీరముల లోన
వలపు పండించు మనవంటి చెలుల కొరకె
కౌముది వసించు, మధురాంధకార మడరు,
మల్లె పందిట, నక్షత్ర మండలమున.

ఐన, శరదిందు కుంద పర్యంకమందు
ప్రేమలో మున్గియున్న అదృష్టజీవి
ఇరులెపుడొ వచ్చునంచు చింతింప నేల ?
సుఖము కంటికి దుఃఖము జూపనేల ?

నరుని గుండెల బండ బంజరులు దున్ని
ధర్మరాసులు పండింప దలతువేని ?
కరుణ రసమును నాగలిగాగ బన్ని
కావ్య కర్షక వృత్తికై కదలిరమ్మ !

హృదయ మున్నప్పుడే జీవి కదల గలదు
కష్ట సుఖములు చూచి, దుఃఖములు వీచి ;
ఎండకును వానకును భేద మెంచలేని
బొమ్మరాతికి నవ్వు, లేడ్పులును గలవె ?

ప్రేమ రాజ్యాల నేలగోరిన యెవారు
కరుణ కవ్వముతో గుండె తరచవలయు,
అమృత కలశము దోసిట నందుకొన్న,
గ్రోల వచ్చును మీద నొక్కొక్క కణము.

హింస, హింస, యటం చేయొ యేమొ వగచి
మల్లి పువ్వనె త్రుంచుట మానినావు,
కాని, అది నేలరాలుట మానలేదు !
పూవు బ్రతుకెంత వృథజేసినావు ? దేవి !

కుటిల కుంతల ! నీమీది కోర్కె తోడ
వచ్చి నీ తోటపూచె నీ మచ్చు మల్లి
నీవు త్రుంచక దాని తృణీకరింప
విఫలమై యది కంట నీర్వెట్టుకొనెదె ?

ఆశయము నందుకోలేని యాశలెన్నొ
రాలి పోవుచునుండును పూల మాడ్కి
కోమలీ ! రాలిపోవు నొక్కొక్క పూవు
ఉన్నతికి దెచ్చు చుండు నొక్కొక్క మొగ్గ.

ఎన్ని మొగ్గల తాయుగమ్ము లిందు గలవొ,
ఎన్ని పువ్వుల రాగమ్ము లింకినవియొ,
కానిచో, యీ పురాతన కాననమ్ము
ఇంత భోగమ్ము కృతి నందుటెట్లు నేడు !

శిధిలములపై పునాదులు సిద్ధపడుచు
కట్టుబడి సాగిపోవు లోకమ్మునందు,
బ్రతుకు చావు లహర్నిశా రతుల లోన,
ఒకటి బింబము, ప్రతిబింబ మొకటి, చాన !

తారకా కల్పకమ్ముల తల్పకమున
మెలకువను గొన్న కలలే సుమీ పవళ్ళు !
సడలని మనోజ్ఞతా పరిష్వంగ మందు
గాఢసు ప్తి లభింప, లోకము లి కేల ?

చెలత ! వచ్చి పోయెడు ప్రతి నిమిష, మెడద
నెదియొ విలువైనదాని దొంగిలుచు, ఎదియొ
భారమును దిగనాడుచు పర్వులెత్తు
పూల విహరించు నవషట్పదాల వోలె !

పూర్తి విలువలు సున్నలై పోయి, పూర్తి
భారమున జీవనము నింపబడక ముందె,
బ్రతుకు బ్రతుకెల్ల కౌగిటబట్టి నొక్కి
దివ్య సుఖ మొక్క టేని ముద్దీయవలయు.

కాల జీమూత నిశ, లంధకార దశలు
తిరిగి తిరిగి, ఈ తరుణ సుందర విభాత
మెట్ల చేరితి మింక, తన్వీ ! వృథాగ
విడిచి పోవగ రా దొక్క విరిని కూడ.

వంచ బోకుము శిర మెంత భారమున్న
నిజము కంటికి లోకువ నీయవలదు
రాగమే సుమ్ము త్యాగాన రాజ్యమేలు,
శక్తి పూజింపబడు నొక్క సహనమందె !

వెను దిరిగి చూడ నేల జీవితము వైపు ?
వ్యర్థ యాపన మౌను స్మృత్యర్థ మెల్ల
అంకురించుచునుండు మారాకు కొరకు
రాలిపోవుచు నుండు కారాకు, చెలువ !

ఆకులను రాల్చుకొలదిగ మ్రాకు పెరుగు,
కాంచు మా నారికేళ వృక్షమును, దేవి !
ప్రాత విశ్వాసముల నెల్ల పదలు కొమ్ము
క్రొత్త క్రొంగొత్త రుచులు రేకెత్త నిమ్ము.

అదె కనుంగొను మా చిగురాకు, సతివ !
నిన్నటికి లేదు, నేటి కుత్పన్నమయ్యె !
మూడు నాళ్ళకు తారుణ్య ముడిగి పోవు
సాలు తిరిగిన మరునాడు రాలిపోవు.

రాలిపడి నీదు లేత పాదాల క్రింద
నలిగి పోయెడి యా కారుసెలల క్రితము
సుందర శరద్వయో రేఖ సుమ్ము, దేవి !
స్వాదు శైశవలేఖ యేడాది నాడు.

ఎంత కాలము నుండి వీక్షించు చుంటి
వీ మహాసత్యమును ? బెంగ లేల చెలువ ?
పండు టాకుల జూచి బాష్పములు రాల
పల్లవమ్ముల గనియు బాష్పములె రాలు !

అంద మానంద మేకమ్మై యంకురింప,
అంకురించున దేలనో అంతరించు !
అంతమేలేని సృష్టి నో యబ్జనేత్ర !
చేయలేకున్న దేలనో జీవశక్తి !

ఎట్లు చేయగ జాలు, సృష్టింపబడిన
దెల్ల నొక దాని నొకటి భక్షించు చుండ !
బ్రతుకునకు భోజన మ్మనవసరమైన
దప్ప, సృష్టికి శాశ్వతత్వమ్ము లేదు.

పండు దిని టెంక బార్వేయు సగిది యొకటి
టెంకనుం దిని జీవించు పంక మొకటి,
జీవ మాధారము మను జీవి యిట్లు,
తగిలి తనుదానె దినుచున్న దౌర సృష్టి !

జీవన మొకండె జీవి స్వభావ మగుట,
చా వనగ బాధ ; తెలియని త్రోవ లందు
ప్రణయ సంబంధ మధుర సూత్రముల నెల్ల
చేతులారగ త్రెంచి పార్వైతు రెవరు ?

ఈ మనో మోహ నారామ ధామ మందు
వెలది ! మనగల నిన్ను సేవించుకొంచె
యుగ యుగమ్ములు ; జీవన మొకటె నాకు
గావలయు గాని, శూన్య మోక్షమ్ము కాదు.

ఎందు కీ బ్రతుకంచు ప్రశ్నించుకొన్న
ఊహ కందని బయలు ప్రత్యుత్తరమ్ము
సారసానన ! పర్యవసాన ఫల వి
హీన మయ్యును జీవిత మెంత తీపి !

పల్లవము పండుటాకయి, పనికిరాని
భారమ్మై పోవ, నిల రాల్చి వైచు లతిక,
ఒక్క నాడు మనోజ్ఞమై యున్న లతయు
క్రుళ్ళి నశియించిపోవు నింకొక్క నాడు !

అయ్యయో ! జీవన వసంతమా ! ద్వితీయ
గర్భమున నెన్ని పుష్ప రాగములు మాసి
పోయె ! ఎంతెంత మధు వింకిపోయె ! ఎంత
శోకమును మ్రింగి, త్రేన్తు వీ శోభనీవు !

చెలువ ! ఓ చెలువా ! సుమ సీమ మిద్ది !
పల్లవమె కాని మనదిందు పండుటాకు
మ్రోడు గనిజాలిపడు చిగు రొండు లేదు
వేడి నిట్టూర్పులను ఖర్చు పెట్టెదేల ?

తొట్రుబు పడనేల, చెల్వ ! ముందునకు పోవు
వారి వెనుకకు లాగు ప్రపంచ మనుచు ?
ఇగురు కారాకు ద్రోచి రేకెత్తె నదిగొ !
వాడి పోవక ముందె దేవతవు కమ్ము.

చివుకు మ్రోడుల జివురింప జేయు శక్తి
లేదు దేవి ! యీ మధుర మధూదయాన,
వాడుట యెరుంగ నట్టి జీవనము తోడ
అమృత మొనరింపు మీ వసంతమును నీవ ?

కమ్మలను చెక్కి వేసెడి కొలది, నతివ !
ఈల చెట్టు ఆకసమున కెదిగిపోవు,
అలరు పుడికిన కొలది తేయాకు మొక్క
విమల పరిమళముల మించి విస్తరించు.

మరచిపో మ్మన్ని బెంగలు మరచిపొమ్ము,
అంద చందాలు బెంగ కాహార మగును ;
రమ్ము, ఈ తేనె మామిడి కొమ్మ లందు
ఆడుకొందము కోకిల జోడు వోలె.

నిలిచి ప్రశ్నింప, కెవ్వరు నెరుగ రీ ప్ర
పంచ గతి, చూచి వచ్చినవారు లేరు ;
గడుసుదనమున కాలము గడుపు వారు
ఊహ చేసిన దానికై మహ పడకు.

విశ్వ మొక కావ్య, మందు జీవించుచున్న
సుఖ విషాద గేయముల నెంచుకొని నీవు
హాయిగా పాడుకొను మిష్టమైన వాని,
పద పదమ్మున రాగమ్ము పల్లవింప !

ముందె గల వెన్నొ అందాలు, ముందె గలవు
పాడవలసిన చిక్కని పాట లెల్ల,
ఆడవలసిన చక్కని యాట లెల్ల ;
ముందునకు సాగి, సాగిపోవుదము లెమ్ము !

ఒరిగి పడిపోవు పూవుల మరచి పోయి
క్రొత్త మొగ్గల స్నేహమ్ము గోరుచుండు
యౌవనం, బిందులేదు దాహమున కంతు,
రస పిపాసికి లేదు జరాభరమ్ము.

పండుటా కెంతకాలము బ్రతికి యుండు
నంత కాలము రెండవయాకు చిగురె ;
శిశిర మాసమ్ము ప్రతిఘటించెదవ యేని
పొంద నేర్తువు నిత్య నవోదయమ్ము.

ప్రకృతి నీవు, నా ప్రణయ రూపమ్ము నీవు,
నవ రసమ్ములు నీవు, ఆనంద మీవు ;
సుందరీ ! నీవు నాలోన కందళించి
పరవశింతును నేను నీ పరిమళమున.

ఒకరు నిదురింప నొకరు మేలుకొను చుండి,
ఒకరి హృదయాన నొక రాగుచుండి, మనము
క్రాంతి జీవన సర్వస్వ కందుకమ్ము
నందుకొని మీటి యాడుకొందము జగాన,

భ్రాంత భయ దాంధకార గర్భములు గడిచి,
కీర్ణ కుజనికుంజములొత్తిగించి, పైకి
ప్రాక గల్గి నప్పుడుగదా లోక వృక్ష
మధుర పక్వ ఫలమ్ములు మనకు దక్కు ?